TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in






వరంగల్ సంపుటి : 2 సంచిక : 33 బుధవారం 16 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in

## దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు

- రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్ ముందు
- దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకం
- రాడార్ కేంద్రానికి శంకుస్థాపనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్
- రోణ వ్యవస్థ పటిష్టం చేసుకోవడంలో ముందున్నాం
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, (అక్టోబర్ 15) : పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామ గుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం

2లో



## ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు

- దేశీయంగా డేటా భద్రంగానే ఉంటుంది
- టెలికమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీని ప్రారంభించిన మోడీ





న్యూఢిల్లీ, (అక్టోబర్ 15) : నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ-2024 ఈవెంట్ ఈ ఏడాది దిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్

2లో

## కలసి ముందుకు వెళ్లండి

### మెదక్ నేతలతో పిసిసి చీఫ్ మహేశ్

హైదరాబాద్, (అక్టోబర్ 15) : నియోజకవర్గ ఇంచార్జిలు భేషజాలకు పోకుండా సమన్వయంతో పనిచేయాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. గాంధీభవన్‌లో మెదక్ ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశంలో పీసీసీ చీఫ్ మాట్లాడారు. పార్టీలో క్రమశిక్షణ అనేది చాలా కీలకమని, దీనిని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక చేశారు. స్థానిక సంస్థల, ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోని, కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ స్కీంలను జనాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఉ మ్మడి

2లో

## రాష్ట్రంలో చిత్తవుతున్న పత్తి రైతు

- ప్రభుత్వ తీరుపై కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్, (అక్టోబర్ 15) : పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం ఆడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న పెట్టుబడి సాయం అందించేలేదు. నేడు కష్టపడి పండించిన పంటను పంటను కొనుగోళ్లు చేయరా అని ప్రశ్నించారు. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలు ఎక్కడన్నారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పి దళారుల రాజ్యం తెస్తారా అని నిలదీశారు. బడే భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం చేస్తుండగా, ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధరకు మించి రూ.8,257 ఇస్తున్నారని, మరి తెలంగాణలో రేతుకు చెల్లిస్తున్నది కేవలం రూ.5 వేలేనా అని ప్రశ్నించారు. రెండేండ్ల క్రితం పత్తి ధర రూ.10 నుంచి రూ.15 వేలు పలికిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ అనర్థం ఏమిటని ఎక్స్ వేదిగా ఫైర్ అయ్యారు. 'బడా భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం. ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి

2లో

## మహారాష్ట్ర, జార్ఖండ్‌లో మోగిన ఎన్నికల నగారా

- మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్
- జార్ఖండ్‌లో రెండు విడతల్లో నవంబర్ 13,20న ఎన్నికలు
- రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 23న ఓట్ల లెక్కింపు
- ఉత్తరప్రదేశ్‌లో 9 అసెంబ్లీ స్థానాలకు 13న ఉప ఎన్నిక
- కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి




న్యూఢిల్లీ, (అక్టోబర్ 15) :మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌నుకేంద్ర ఎన్నికల సంఘం ప్రకటిం చింది. మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరుపనున్నట్టుసీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. నామినేషన్ల గడవు అక్టోబర్ 29వ తేదీతో ముగుస్తుంది. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 30న

2లో

## రాడార్ కేంద్రం ఏర్పాటుపై రాజకీయమా

- కేటిఆర్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి




హైదరాబాద్, (అక్టోబర్ 15) : తెలంగాణకు గర్వకారణమైన రాడార్ ప్రాజెక్టుపై భారాస, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండి పడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే దీనికి సంబంధించిన జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట మాట్లాడు తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌కు సహకరించాల్సింది పోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటున్నారని విమర్శించారు. దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారా..? అని నిలదీశారు. రక్షణ శాఖకు సంబంధించిన షిప్స్‌ను కమ్యూనికేట్ చేసే రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకు ఎంతో పేరు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా అటవీ శాఖ నుంచి కేంద్ర పర్యావరణ శాఖ వరకూ అన్ని అనుమతులు పొందిందని చెప్పారు.

## గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

### పలు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, (అక్టోబర్ 15) : గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు

2లో



## అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు భారత్ డీల్

న్యూఢిల్లీ (అక్టోబర్ 15) : ఇండియన్ ఆర్మీ నిఘా సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసే దిశగా అమెరికా, భారత్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్‌ల కొనుగోలు ఒప్పందంపై రెండు దేశాలు మంగళవారంనాడు సంతకాలు చేశాయి. రూ.32,000 కోట్లు విలువచేసే ఈ డీల్‌కు క్యాబినెట్ ఆన్ సెక్యూరిటీ గతవారంలో అనుమతినిచ్చింది. మొత్తం 31 డ్రోన్‌లలో 15 డ్రోన్లు నావికాదళానికి సరఫరా అవుతాయి. తక్కిన వాటిని ఆర్మీ, వైమానికి దళానికి సమానంగా విభజించనున్నారు. కాగా, ఈ డీల్ కింద భారతదేశంలో మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (ఎంఆర్ఓ)

2లో

# సంపాదకీయం

## ఓటరు దేవుళ్లు, ప్రజాస్వామ్య పూజారులు

ఎన్నికలలో ఒక అభ్యర్థిగా పోటీ చేయడం చాలా కఠోరమైన పని. శ్రద్ధగా శ్రమించవలసి వున్నది. అయితే ఆ పోటీ, వేసిన బాటలో నడవడం వంటిదే. ఒక అభ్యర్థి తరఫున ఒక ఎన్నిక ప్రక్రియను నిర్వహించడం ఒక కఠినమైన, చిక్కుతో కూడిన బాధ్యత. ఆ విధి నిర్వహణకు ప్రావీణ్య ముండాలి. రాష్ట్ర స్థాయి ఎన్నికలను పర్యవేక్షించడం, ఒక రాజకీయ పార్టీ తరఫున ఆ రాష్ట్ర శాఖ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఉండడమనేది ఒక సంక్లిష్ట కర్తవ్యం. ఆ కర్తవ్య పాలన వివిధ వ్యవహారాలతో ముడివడి ఉం టుంది. దీక్షాదక్షతలు, క్లిష్ట పరిస్థితులను చక్క బెట్టగల చాకచక్యం ఎంతైనా అవసరం. ఎన్నికలు ఒక నిర్ణయాత్మక ఫుట్‌బాల్ మ్యాచ్ వంటివి. అందులో ఒక జట్టు కోచ్ విజేత అవుతాడు. ప్రత్యర్థి జట్టు కోచ్ పరాజితుడు అవుతాడు. ఏ ఎన్నికలలోనైనా ఒక రాజకీయ పక్షం గెలవడమో లేదా ఓడిపోవడమో జరుగుతుంది. ఒక రాజకీయ పార్టీ ఎన్నికలలో పరాజయం పాలయిన సందర్భాలు విజయం సాధించిన పర్యాయాల కంటే అధికంగా ఉంటే అందుకు కారణమైన పరిస్థితులను ప్రశాంతంగా పునరావలోకనం చేసుకోవాలి. ఎక్కడ సరైన నిర్ణయం తీసుకున్నాం, ఎక్కడ తప్పు చేశామో నిష్పాక్షికంగా పరీక్షించుకోవాలి. ఎన్నికల యోధుడుగా నా కథ 1984 లోక్‌సభ ఎన్నికలలో నా అభ్యర్థిత్వంతో ఆరంభమయింది. దరిమిలా నేను మొత్తం ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు పోటీ చేశాను. ఏడు సార్లు గెలిచాను. నేను పోటీ చేసిన ఎన్నికలకు ముందు, ఆ తరువాత ఎన్నో ఎన్నికలను నిర్వహించాను. ఇప్పటికీ నా సొంత జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాను. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నికల భారతంలో ఎన్నో మార్పులు. అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా. అప్పట్లో పార్టీ అభ్యర్థి తరఫున ఆ పార్టీ అధినేత నియోజకవర్గానికి ఇలా వచ్చి ఓటర్లకు ముఖం చూపించి అలా వెళ్లిపోతే చాలు గెలుపు ఖాయం. ఇలా విజయాన్ని సులువుగా దక్కించుకునే అభ్యర్థులూ చాలా మంది ఉండేవారు. పార్టీ అగ్రనాయకులు బహిరంగ సభల్లో ఓటర్ల నుద్దేశించి క్లుప్తంగా ప్రసంగించినా అభ్యర్థికి తప్పక విజయం సిద్ధించేది. తాము అభిమానించే నాయకుని భావభంగిమలను చూసి సంతృప్తిపడే ఓటర్లు అసంఖ్యాకంగా ఉండేవారు. ఆ సంతృప్తితో ఆ నాయకుడు చెప్పిన అభ్యర్థిని ఎన్నుకోవడానికి సందేహించేవారు కాదు. ఇటువంటి పరిస్థితి ఇంకెంత మాత్రం లేదు. ఒకప్పుడు ఒక అభ్యర్థి ఒక కులపెద్ద లేదా కులపెద్దల మద్దతు సమకూర్చుకునేవాడు. అది చాలు ఆ కులానికి చెందిన ఓటర్లలో అత్యధికుల ఓట్లను స్వాయత్తం చేసుకునేందుకు. కుల అభిమానం అలా పనిచేసేది. మరి అటువంటి మద్దతును అభ్యర్థులు ఇప్పుడూ సాధించుకుంటున్నారా? లేదు, అ సులభ పరిస్థితి ఇంకెంత మాత్రం కొనసాగడం లేదు. కాలం మారింది, సందేహం లేదు. ఒకప్పుడు ఒక రాజకీయ పక్షం తన సంకల్పాలు, వాగ్దానాల గురించి వివరించే మేనిఫెస్టో (ఎన్నికల ప్రణాళిక) అనవసర వ్యవహారంగా ఉండేది. ఇప్పుడా? అలా కానే కాదు. 'కథనం' (ముఖ్యంగా ఒక నాయకుడు ఉత్తమ పురుషలో మాట్లాడుతూ శ్రోతలను ఉర్రూత లూగించే నాటకీయ వచో వైభవం) ప్రాధాన్యాన్ని రాజకీయ పార్టీలు కనుగొనని కాలం ఒకటి ఉండేది. అయితే ఇప్పుడు ఆ మాట తన అనేకానేక అర్థ /భావ భేదాలతో ఈ కాలం ఎన్నికలను అపరిమితంగా ప్రభావితం చేస్తోంది. నాడు ఎన్నికల ఉపకరణా లుగా ఉన్న మెగా ఫోన్‌లు, మైక్రో ఫోన్‌లు, కరపత్రాలు, జెండాలు, పూలమాలలు నేడు పూర్తిగా కాలం చెల్లినవై పోయాయి. సామాజిక మాధ్యమాలు, టెలివిజన్ వాణిజ్య ప్రకటనలు, నకిలీ వార్తలు, పెయిడ్ న్యూస్ మొదలైనవి నేటి ఎన్నికల ప్రధాన, ప్రభావదాయక ఉ పకరణాలుగా ఉన్నాయి. కొన్ని వార్తా పత్రికలు చిత్తశుద్ధి, వృత్తి ధర్మ నిబద్ధత, నైతిక నిష్ఠతో వ్యవహరిస్తున్నాయి. ఇదే మన ప్రజాస్వామ్యానికి కొండంత రక్ష. అయితే రాబోయే పది సంవత్సరాలలో ఎన్నికల వ్యవహారాలలో వార్తా పత్రికలు పూర్తిగా అనవసరమైపోవచ్చని నేను భావిస్తున్నాను. భయపడు తున్నాను కూడా. ఎన్నికల భారతంకు నేను ఐదు దశాబ్దాలకు పైగా ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాను. ఎన్నో నాటకీయ మార్పులు, మరెన్నో విచిత్ర పరిణామాలు సంభవించాయి. వాటిలో కొన్ని మాత్రమే స్థిరమైనవి, నిరం తరమైనవి, శాశ్వతమైనవి సూక్ష్మ వ్యత్యాసాలు, నాజూకు మార్పులతో సుమా! ఒక రాజకీయ పక్షానికి, ఆ మాటకొస్తే అధికారం కోసం పోటీపడే ఏ రాజకీయ పక్షం అయినా నిభాయించుకు రావాల్సిన నిరంతర ప్రాధాన్యమున్న వ్యవహారాలు కొన్ని ఉన్నాయి. అవేమిటో వివరంగా చూద్దాం. తొలుత ప్రస్తావించవల్సింది నగర, జిల్లా, కింది స్థాయి కమిటీలు: ఒక రాజకీయ పక్షం జాతీయ అధిష్ఠాన వర్గం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమవుతుంది. ఇది సరిపోతుందా? సరిపోదు గాక సరిపోదు. పార్టీ జాతీయ కార్యవర్గమే కాదు, నగర, జిల్లా, మండల, గ్రామ, వార్డు స్థాయి కమిటీలు కూడా నిర్దిష్ట కాల వ్యవధుల్లో క్రమబద్ధంగా సమావేశమవుతుండాలి. తమ పరిధిలోని ప్రజల వ్యవహారాలను సమీక్షిస్తుండాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ కమిటీలు ప్రతి రోజూ 24 గంటలూ ప్రజలకు సన్నిహితంగా ఉండి తీరాలి. మరి ఒక రాజకీయ పక్షం అనేక సంవత్సరాలుగా నగర, జిల్లా, కింది స్థాయి కమిటీలను నియమించని పక్షంలో ఆ పార్టీని ఏమనాలి? సదరు రాజకీయ పక్షం సంబంధిత రాష్ట్రంలో కేవలం ఒక భావనాత్మక పార్టీగా మాత్రమే ఉందని నేను అంటాను. సరైన భౌతిక అస్తిత్వం లేని పార్టీ ప్రజలకు ఎలా చేరువవుతుంది?

# దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు

ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు. అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగ పడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు అన్నారు. నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కేంద్రాన్ని మూడేళ్లలో పూర్తి చేసేందుకు కేంద్రం ప్లాన్ రెడీ చేసింది. వెరీ లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడర్ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుకు ఎప్పుడో కేంద్రం ఓకే చెప్పింది. ఇన్ని రోజులకు మంగళవారం భూమిపూజ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల 55 నిముషాలకు భూమిపూజ జరిగింది. దేశంలోనే అతిపెద్ద రెండో వీఎల్ఎఫ్ నేవీ రాడార్ సెంటర్‌గా దీన్ని 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్రం సంకల్పించింది. దీని నిర్మాణానికి 2,900 ఎకరాల అటవీ భూమిని ఈస్టర్న్ నావెల్ కమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ భూమి అప్పగింతతో ఇక్కడ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు మార్గం సులభమైంది. ఈ రాడార్‌లో సదుపాయాలు కల్పించేందుకు ఈ అటవీ ప్రాంతం చుట్టూ దాదాపు 24 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తారు. ఇప్పుడు శంకుస్థాపన చేసిన ప్రాంతంలో రాడార్ స్టేషన్‌తోపాటు 2500 మంది నివాసం ఉండేలా టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. అందులో స్కూల్స్, హాస్పిటల్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ దాదాపు 500 మందికిపైగా నేవీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పని చేస్తారు. రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేసిన తర్వాత వికారాబాద్ పూడూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందన్నారు. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది. కొందరు వీఎల్ఎఫ్‌ను వివాదం చేస్తున్నారు. వీఎల్ఎఫ్‌తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయాల మోసం వివాదం చేసేవారికి కనువిప్పు కలగాలి. 2017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలియజేశారు. 'ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్ నాథ్ సింగ్ అడగ్గానే మేం కొనసాగించాం. దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించా.. పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా... దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం... దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్ ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదు.. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు... దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలి. వీఎల్ఎఫ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. రాడార్ ఏర్పాటు ప్రాంతంలో గుడికి వచ్చేందుకు ప్రజలకు అనుమతి ఇవ్వాలని రాజ్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. ' ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. ఆలయానికి ఇబ్బందులు కలిగించొద్దని కోరుతున్నా.. ప్రజల సెంటిమెంట్, విశ్వాసాన్ని గౌరవించి ఆలయానికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరుతున్నా.. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో ఈ ప్రాంత ప్రజలకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మన పార్టీలు వేరు కావొచ్చు.. సిద్దాంతాలు వేరు కావొచ్చు. దేశ భద్రత, రక్షణ విషయంలో మేం ఎప్పుడూ మీతో కలిసి వస్తాం. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుంది. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా. కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ వివాదాలకు తెరలేపుతు న్నారు. దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు. ఈ ప్రాజెక్టుకు భారాస ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చింది. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## మహారాష్ట్ర, జార్ఖండ్‌లో మోగిన ఎన్నికల నగారా

జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 4వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 25వ తేదీలోగా ఎన్నికలు ముగియాల్సి ఉంటుంది. జార్ఖాడ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా జరుగనున్నట్టు సీఈసీ ప్రకటించారు. తొలి విడత నవంబర్ 13, రెండో విడత నవంబర్ 20న జరుగుతుంది. తొలి విడత ఎన్నికలకు అక్టోబర్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. అక్టోబర్ 25తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 28న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 30తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తొలి విడతలో భాగంగా 43 నియోజకవర్గాలకు నవంబర్ 13న పోలింగ్ జరుగుతుంది. రెండో విడత నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. అక్టోబర్ 29తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 1వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగుస్తోంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 81 స్థానాలున్న జార్ఖాండ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగుస్తుంది. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన, ఎన్‌సీపీతో కూడిన మహాకూటమి ప్రభుత్వం అధికారంలో ఉ ండగా, జార్ఖాండ్‌లో జెఎంఎం అధికారంలో ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల తేదీని కూడా ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రకటించింది. నవంబర్ 13న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కూడా ఇదే రోజు ప్రకటిస్తారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరగనున్న 9 అసెంబ్లీ స్థానాల్లో మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, ఖైర్, కర్హాల్, సిషామౌ, ఫూల్పూర్, కతెహారి, మజవాన్ ఉన్నాయి. వీటిలో నాలుగు స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకోగా, బీజేపీ 3, రాష్ట్రీయ లోక్‌దళ, నిషద్ పార్టీ చెరో స్థానం గెలుచుకున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన ఆయా పార్టీల నేతలు తాము గెలిచిన అసెంబ్లీ స్థానాలను వదులుకోవడంతో యూపీలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యూపీలో ఎదురుదెబ్బ తగలడంతో ఈ అసెంబ్లీ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు గట్టి సవాలనే చెప్పాలి.

## ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు

ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్‌లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే పక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్‌లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్‌లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్‌లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్‌లు ప్రదర్శించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి సింధియా దేశీయ టెలికాం గురించి మాట్లాడారు.భారత్‌లో టెలికాం అనేది కేవలం వినోద మాధ్యమం కాదని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన సమాచారం, గ్లోబల్ కమ్యూనిటీతో కనెక్ట్ అయ్యే సదుపాయాల కోసం వేగంగా విస్తరించిందన్నారు. 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. స్పామ్ కాల్స్ పెరుగుతున్న తరుణంలో వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

## అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు భారత్ డీల్

సదుపాయాన్ని కల్పిస్తారు. అమెరికా నుంచి సేకరించే ఈ ప్రిడేటర్ డ్రోన్‌లను చెన్నైలోని ఐఎన్ఎస్ రాజాలి, గుజరాత్‌లోని పోర్‌బందర్, సరసావా, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లలో మోహరించనున్నారు. ఈ డీల్‌ను ఖరారు చేసేందుకు అమెరికా మిలటరీ, కార్పొరేట్ ప్రతినిధులు ఇటీవల భారత్ వచ్చారు. అమెరికా నుంచి భారత్ భారీ డీల్‌కు సంబంధించి ఒప్పందాలపై సంతకాల కార్యక్రమంలో రక్షణ, నేవీ శాఖ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

## కలసి ముందుకు వెళ్లండి

మెదక్ జిల్లాలో గ్రౌండ్ లెవల్‌లో పార్టీ కోసం నాయకులంతా మరింత గట్టిగా పనిచేయాల న్నారు. నియోజకవర్గ ఇంచార్జిలు అందరినీ కలుపుకొని పోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు.

## రాష్ట్రంలో చిత్తవుతున్న పత్తి రైతు

రైతు చిత్తు. గుజరాత్ లో మద్దతు ధరకు మించి రూ.8,257 రేటు. మరి తెలంగాణలో పత్తి రైతుకు కేవలం రూ.5 వేలేనా?. మార్కెట్ కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. రెండేళ్ల క్రితం పత్తికి 10 నుంచి 15 వేల ధర. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏమిటీ అనర్థం?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు.. నేడు కష్టించి పండించినా కొనుగోళ్లు చేయరా..? పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం. ముందుచూపు లేని ముఖ్యమంత్రి వల్లే ఈ అన్యాయం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# మృత దేహానికి నివాళులర్పించి,ఆర్థిక సాయం అందజేసిన కరుణాకర్ రావు



తెలంగాణ ముచ్చట్లు,జఫర్గడ్: మండలం లోని ఓబులపూర్ గ్రామంలో సోమవారం కందిక భద్రమ్మ(110)మరణించగా భౌతిక దేహాన్ని సందర్శించి,నివాళులర్పించి, రూ 5000ఆర్థిక సాయంగా అందజేసిన పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు. వారి వెంట దేవదాస్, కుమారస్వామి, అనీల్, శివయ్య, సంతోష్ తదితరులు ఉన్నారు.

# అర్హత గల వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రు లు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు అర్హత గల వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యచరణ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. అర్హత గల వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ కొరకు ఫారం-18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కొరకు ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ నెల 16వ తేదీన మొదటి రిపబ్లికేషన్, 25వ తేదీన 2వ రిపబ్లికేషన్ చేయడం జరుగుతుందని, నవంబర్ 6వ తేదీన నమోదు చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. నవంబర్ 20వ తేదీన నమోదు అయిన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23వ తేదీన ప్రచురించడం జరుగుతుందని, 23 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, డిసెంబర్ 25వ తేదీన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి సంబంధిత పత్రాలను పరిశీలించి 30వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మొదటి రిపబ్లికేషన్ ఈ నెల 16న జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని ఎంపిక చేసిన ప్రాంతాలు, రాజస్వ మండల అధికారులు, మండల తహశిల్దార్ల కార్యాలయాలలో రిపబ్లికేషన్ సంబంధిత నోటీసులు ప్రదర్శించాలని తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాలకు జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. వివరాల కొరకు, దరఖాస్తు చేసుకునేందుకు ఆన్లైన్లో, తహశిల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

# బాపనంతపురం గ్రామం నందు పొలంపిలుస్తుంది కార్యక్రమం

**ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు :** ఆత్మకూరు మండలంలోని స్థానిక అర్బన్ రైతు సేవ కేంద్రం బాపనంతతపురం గ్రామం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అధిక వర్షాలకు ముందస్తు జాగ్రత్తగా కంది పంట కంది ప్రస్తుత మొగ్గ నుండి పూత దశలో ఉంది కాబట్టి వర్షాలు ఎక్కువై ఎక్కడైనా పొలంలో నీరు నిలబడితే పొలం గట్ల తెల్చి నీటిని బయటికి పంపాలి లేకపోతే వేరు కుళ్ళు, ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుందని రైతులకు తెలియజేశారు అలాగే రబీలో వేసే మినుము, శనగ, పంటలపై అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో సెరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్ మరియు బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు ఎస్ రవి గౌడ్, శ్రీను, మరియు కౌలు రైతు సంఘం అధ్యక్షులు తపాలా అశ్రఫ్ అలీ కృషి విజ్ఞాన పండ్ల%ష్ట్ర% తోట అధ్యక్షుల మహబూబ్ బాషా మరియు రైతులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు మాజీ ఎంపీ నామ పరామర్శ

## - ముల్పూరి నారాయణ ,చల్లపల్లి రాధమ్మ లకు నివాళ్లు అర్పించిన మాజీ ఎంపీ నామ





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం పట్టణానికి చెందిన ముల్పూరి నారాయణ ఇటీవల మరణించగా మంగళవారం నాడు నగరం లోని బాలాజీ నగర్ నందు ఉన్న వారి నివాసానికి బీ.ఆర్.యస్ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు వారి ఇంటికి వెళ్లి వారి కుమారుడు ప్రవీణ్, కుమార్తె ప్రశాంతి తో పాటు వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు. అలానే ఇటీవల శాస్త్ర చికిత్స చేయించుకుని అక్కడే విశ్రాంతి తీసుకుంటున్న డా.వై వీ రామారావు ను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి పై డాక్టర్ ఆంధ్రజ్యోతి, డాక్టర్ మిక్కిలినేని విజయకుమార్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాకు చెందిన చల్లపల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి రాధమ్మ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, రాధమ్మ కుమారులు సత్యనారాయణ, సీతారామయ్య, నాగేశ్వరరావు, దేవేందర్ రావు, శ్రీనివాసరావు, మనవడు చల్లపల్లి రవితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి నామ తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. నామ వెంట కనకమేడల సత్యనారాయణ, నాదెండ్ల సుధాకర్, మొండితోక జయకర్, రావూరి శ్రీనివాసరావు, బాణాల వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, కర్నాటి శ్రీను, కొటారి రాఘవరావు, వాకదాని కోటేశ్వరరావు, అబ్బూరి రామన్, నామ సేవా సమితి సభ్యులు పాల్వంచ రాజేష్, తాళ్లూరి హరీష్ బాబు, కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

# వేముల పూర్ణ కుమారుడుకు మాజీ ఎంపీ నామ ఆశీర్వాదం





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఖమ్మం పట్టణం లో ప్రముఖ గ్రానైట్ వ్యాపారి వేముల రవికుమార్ సోదరుడు వేముల పూర్ణ, మమత దంపతుల కుమారుడు నవీన్ కుమార్ వివాహం రేపు జరగనుండగా మంగళవారం నాడు ఖమ్మం నగరం లోని రాపర్తి నగర్ నందు ఉన్న వారి నివాసానికి బీ.ఆర్.యస్ మాజీ లోక్ సభపక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు వెళ్లి పెళ్లి కుమారుడుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాజీ ఎంపీ నామ కొద్ది సేపు ముచ్చటించారు. కార్యక్రమంలో పలువురు గ్రానైట్ వ్యాపారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, మొండితోక జయకర్, రావూరి శ్రీనివాసరావు, బాణాల వెంకటేశ్వర్లు, గొడ్డేటి మాధవరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, కర్నాటి శ్రీను, కొటారి రాఘవరావు, ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేంద్ర, మాజీ సర్పంచ్ శివాజీ పెద్ద గోపవరం, రమేష్ నాయక్, వాకదాని కోటేశ్వరరావు, బిఆర్ఎస్ యువజన నాయకులు అబ్బూరి రామన్, నామ సేవా సమితి సభ్యులు పాల్వంచ రాజేష్, తాళ్లూరి హరీష్ బాబు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

# చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలి

## - రేసపువానిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**విశాఖపట్టణం, తెలంగాణ ముచ్చట్లు :** గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్థానిక రేసపువానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరకుల నిల్వలను పరిశీలించారు. పిల్లల నేమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. వారితో సరదాగా గడిపారు. తనిఖీలో భాగంగా నిర్వాహకులతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. నెలవారీ సరకులు, టీహెచ్ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరకులను అందజేయాలని, చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడివారిని ఆదేశించారు.



# ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

**కాజిపేట్ తెలంగాణ ముచ్చట్లు :** కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది సూసైడ్ నోట్ రాసి వాట్సాప్ కాల్ చేసి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన యువకు ని పోలీసులు కాపాడిన సంఘటన మంగళవారం మడికొండలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుగ్గొండి మండలం మదనపల్లి గ్రామానికి చెందిన రాసమల్ల. రమేష్ (27)అనే వ్యక్తి ప్రస్తుతం హైదరాబాదులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ దసరా పండగ కి ఇంటికి రాగా ఇంట్లో గొడవలకు మనస్థాపం చెందాడని వారు తెలిపారు. రమేష్ ఇంట్లో నుండి బయటకు వచ్చి సూసైడ్ నోట్ రాసుకొని వాట్సాప్ కాల్ ద్వారా వారి ఇంటి సభ్యులకు నేను చనిపోతున్నానని తెలియజేశాడని పోలీసులు వివరించారు. ఆత్మహత్య చేసుకోవడానికి మడికొండ గ్రామంలోని అయోధ్య పురం రైల్వే ట్రాక్ పైకి రాగా 100 డయల్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న బ్లూ కోట్స్ పోలీసులు రామనాథం, వాసు లు యువకుని ప్రాణాలు కాపాడగా మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ యువకుడి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి ఇంటికి పంపియ్యడం జరిగిందని పోలీసులు తెలిపారు.

# ఈ నెల 17న మహర్షి వాల్మీకి జయంతి

## - జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి వినోద్ కుమార్

**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని నస్పూర్ లో సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

# విజేతలకు బహుమతి ప్రధానం



**కాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు :** దక్షిణ మధ్య రైల్వే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కాజీపేట లోని రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పక్వాడ్, స్వచ్ఛ భారత్ లో భాగంగా రైల్వే ఉద్యోగుల పిల్లలకు స్వచ్ఛభారత్ అనే అంశంపై పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో 18 మంది పిల్లలు పాల్గొన్నారు. మొదటి బహుమతి పి. జాహ్నవి రెండవ బహుమతి ఎల్. వర్షిత మూడవ బహుమతి బి. మధు శ్రీ లను ఎంపిక చేశారు. ఈ బహుమతులను కాజీపేట రైల్వే జర్నలిస్ట్ చైర్మన్ ,ఎలక్ట్రికల్ లోకో షెడ్ సీనియర్ డి ఈ ఈ ఆర్. ప్రశాంత్ కృష్ణ సాయి చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు

# బి. కోడూరు గ్రామంలో పల్లెపండుగవారోత్సవాలు

**బండి ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు :** నంద్యాల జిల్లా. శ్రీశైలం నియోజకవర్గం : బండి ఆత్మకూరు మండలం బి-కోడూరు గ్రామంలో " పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు " కార్యక్రమంలో భాగంగా నేడు రూ.21.50 లక్షల వ్యయంతో నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

### - రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** రాష్ట్రంలోని ఇతర నగరాలకు, పట్టణాలకు మన ఖమ్మం నగరం ఆదర్శంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం మంత్రి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ సారథి నగర్ లో పర్యటించి టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన స్మార్ట్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ,హౌ సెప్టెంబర్ నెలలో అకస్మాత్తుగా భారీ వరదలు వచ్చినప్పటికీ ప్రాణ నష్టం అధికంగా జరగకుండా ప్రజలలో ఉంటూ సేవలు అందించిన ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మున్నేరు వరద, చెరువుల నుంచి వచ్చే వరద పట్టణాన్ని ముంచే పరిస్థితి మరోసారి రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి, వరద ఎటు నుంచి వచ్చి ఎలా వెళ్లాలో డిజైన్ చేసేందుకు నిపుణుల కమిటీని నియమించమని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందని, భవిష్యత్తులో ఎటువంటి తప్పులు జరగకుండా పకడ్బందీగా వరద నివారణ చర్యలు ప్రభుత్వం చేపడుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం నిర్మించే మురుగునీటి కాలువల డిజైన్ సైతం పక్కాగా ఉండాలని, మురికి కాలువ నిర్మాణం చివరి వరకు వెళ్లే విధంగా చూడాలని, వీటి నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రావద్దని మంత్రి ఇంజనీర్లకు సూచించారు. నాలాలు, నీటి ప్రవాహాలలో ఉన్న ఆక్రమణలను తొలగించే సమయంలో మానవతా దృక్పథంతో ఉండాలని మంత్రి తెలిపారు. ఆక్రమణలలో ఉన్న పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు మరో చోట అందించి, వారిని తరలించిన తర్వాత ఆక్రమణలను తొలగించాలని మంత్రి తెలిపారు. ఆక్రమణలు తొలగించిన తర్వాతనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఆయా డివిజన్ల లో కార్పొరేటర్లు పేద ప్రజలతో చర్చించి వారికి మెరుగైన పునరావాసం కల్పించి, వచ్చే వర్షాకాలం నాటికి కాలువ నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చూడాలని మంత్రి అన్నారు. ఖమ్మంలో వరద నివారణ చర్యలకు ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తుందని, వీటిని సరిగ్గా వినియోగించుకోవాలని, మురికి కాలువ నిర్మాణాలు నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మురికి కాలువల నిర్మాణాలు పనులు పూర్తి చేసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు సహకరించాలని మంత్రి కోరారు. నగరంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలు తడి, పొడి చెత్త వేర్వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని, చెత్తను కాల్వలో వేయవద్దని మంత్రి ప్రజలకు సూచించారు. ఖమ్మం పట్టణానికి అవసరమైన నిధులు ముఖ్యమంత్రిని అడిగి తీసుకొని వస్తానని, నగరాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఖమ్మంగా తీర్చిదిద్దాలని, ఖమ్మం నగరంలో మంచి చదువు, వైద్యం, రోడ్లు అందుబాటులోకి రావాలని, ప్రజలంతా ఎటువంటి భేదాలు లేకుండా ఐక్యమత్యంతో ఉండాలని, రాష్ట్రంలోని ఇతర నగరాలకు ఖమ్మం ఆదర్శంగా నిలవాలని, ఇందుకు మనమంతా కృషి చేయాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నూకల నరేష్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

### - నూకల నరేష్ రెడ్డి గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి
### - మాజీ ఎంపీ నామ
### - నూకల నరేష్ రెడ్డి కి ఘన నివాళులు అర్పించిన మాజీ ఎంపీ నామ




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** మరిపెడ మండలం పురుషోత్తమయ గూడెం గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు నూకల నరేష్ రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం నాడు దశ దిన కర్మ సందర్భంగా గ్రామం లో జరిగిన సంస్మరణ సభలో బి.ఆర్.ఎస్ మాజీ లోక్ సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నామ మాట్లాడుతూ తన తండ్రి నామ ముత్తయ్య నుండి నూకల రామచంద్రారెడ్డి కుటుంబంతో ఏర్పడిన అనుబంధం, తర్వాత రామ్ సహాయం సురేందర్ రెడ్డి మరియు నూకల నరేష్ రెడ్డి కుటుంబాలతో కొనసాగిందని చెప్పారు. రాజకీయాల్లో వచ్చిన తర్వాత తెలుగు దేశం పార్టీ లో ఆ తర్వాత టీఆర్ఎస్ పార్టీలోకి చేరిన నూకల నరేష్ రెడ్డి, ఆ పార్టీల్లో అభివృద్ధి కోసం క్రియాశీలకంగా పని చేశారని వివరించారు. నరేష్ రెడ్డి మరణానికి పది రోజుల ముందు, ఆయన హైదరాబాద్‌లో నామ ఇంటికి వచ్చి దాదాపు రెండు గంటల పాటు పలు విషయాలపై చర్చించిన విషయాని ఈ సందర్భంగా నామ గుర్తుచేసుకున్నారు. నరేష్ రెడ్డి వ్యక్తిత్వం గొప్పదని, దేవుడు మంచి వాళ్లను ముందుగా తీసుకెళ్తాడని అనే సామెత చందంగా నూకల నరేష్ రెడ్డి ని మన నుండి దూరం అవడం చాలా బాధాకరమన్నారు, ఇలా జరుగుతుందని ఎప్పుడు అనుకోలేదని నామ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల చెప్పినట్లు, నరేష్ రెడ్డి పదవి లేకపోయినా ప్రజల అభిమానాన్ని పొందారని, ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసమే తపించేవారని పేర్కొన్నారు. పార్టీలో ఉండగా ఆయనకు పదవి ఇవ్వడానికి తాము చేసిన ప్రయత్నాలను గుర్తుచేసుకున్నారు. నరేష్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నామ భగవంతుడ్ని ప్రార్థించారు. నామ వెంట మొండితోక జయకర్, రావూరి శ్రీనివాసరావు, బాణాల వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, కర్నాటి శ్రీను, కొటారి రాఘవరావు, అబ్బూరి రామన్, నామ సేవా సమితి సభ్యులు పాల్వంచ రాజేష్, తాళ్లూరి హరీష్ బాబు, కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు

# నమస్కారం, బాగున్నారా.. నేను మీ జిల్లా కలెక్టర్... ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా..

### - వ్యాపార పెట్టుబడి కోసం బ్యాంకు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
### - సమస్యలు ఉంటే నేరుగా తనను కలెక్టరేట్ లో వచ్చి కలవాలి
### - నగరంలోనీ ఫుట్ వేర్ షాప్, ఆటో స్టాండ్ వద్ద ఆగి వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** నమస్కారం, బాగున్నారా, నేను మీ జిల్లా కలెక్టర్ ని, ఎలా నడుస్తున్నది వ్యాపారం, ఇక్కడి నుండి ఎక్కడి వరకు ఆటో నడుపుతారంటూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆటో డ్రైవర్ లు, ఫుట్ వేర్ యజమాని వద్దకు వెళ్లి వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఖమ్మం బస్ స్టాండ్ కు ఆనుకొని షాదీఖాన వెళ్ళే రోడ్డులో ఉన్న ఫుట్ వేర్ షాప్ లోకి కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా వెళ్లి వ్యాపారం ఎలా నడుస్తున్నది, రోజువారీ సంపాదన, కుటుంబ పోషణ, పిల్లల చదువు నేపథ్యం మొదలగు వివరాలను షాప్ యజమాని సయ్యద్ బిలాల్ పాషా తో మాట్లాడి తెలుసుకున్నారు. వ్యాపార నిమిత్తం చెప్పుల స్టాక్ ఎక్కడి నుండి తెస్తారు, దానికి పెట్టుబడి ఎలా వస్తుంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారాలు చేసే వారి కోసం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా, అలాగే ముద్ర పథకం ద్వారా తక్కువ వడ్డీతో పెట్టుబడి కోసం రుణాలు పొందవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తర్వాత బస్టాండ్ సిగ్నల్ ప్రాంతం మూల మీద ఆగి ఉన్న ఆటో స్టాండ్ వద్దకు వెళ్లి ఆటో డ్రైవర్ లతో మాట్లాడారు. ఆటో డ్రైవర్ లు రోజుకు ఎంత సంపాదిస్తున్నారు, కుటుంబ పోషణకు సరిపోతున్నాయా, ఆటో సొంతందా , కిరాయికి తెచ్చుకున్నారా వంటి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గా మీరే మా వద్దకే వచ్చి మాకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడగడం చాలా సంతోషంగా ఉందని ఆటో డ్రైవర్ లు తెలిపి, ఖమ్మం నగరంలో 3 వేల వరకు ఆటోలు ఉంటాయని, ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆటో అడ్డాలు పెంచాలని , వసతులు కల్పించాలని ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ ప్రసాద్ జిల్లా కలెక్టర్ ను కోరారు. ఖమ్మం జిల్లాలో పని చేసే మున్సిపల్ కార్మికులు, పంచాయతీ వర్కర్లకు ఇటీవల ఇన్సూరెన్స్ కల్పించామని, ఆటో డ్రైవర్ లు ప్రతి సంవత్సరం ఆర్.టి.ఓ. దగ్గర రెన్యువల్ చేసే సమయంలో కొంత మొత్తం చెల్లించడానికి ముందుకు వస్తే, ఆటో డ్రైవర్లకు కూడా ఇన్సూరెన్స్



కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని, దీనిపై త్వరలో జిల్లా స్థాయి ఆటోల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులతో చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆటో అడ్డాల దగ్గర త్రాగునీటి సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లల చదువుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ లు మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో చదువు తున్నారని తెలుపగా, గురుకులాలలో, ప్రభుత్వ బడులలో పిల్లలు ఎలా చదువుతున్నారు, టీచర్లు జవాబుదారీ తనంతో ఉన్నారా, పేరెంట్ టీచర్స్ మీటింగ్ లకు హాజరవుతున్నారా వంటి వివరాలు కలెక్టర్ ఆరా తీశారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్ లకు రెగ్యులర్ గా హాజరు కావాలని, ప్రభుత్వ బడులలో ఏదైనా లోపాలు ఉంటే వెంటనే తెలియజేయాలని వాటిని సవరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పిల్లల చదువులపై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్యం ఎలా అందుతుంది, ఆటో డ్రైవర్లు వెళ్లినప్పుడు అవసరమైన మందులు ఇచ్చారా వంటి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్ లకు ఏదైనా ఇబ్బందులు ఉంటే తనను కలెక్టరేట్ కు వచ్చి కలవాలని, సమస్యల పరిష్కారానికి వీలైనంతవరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# బాణసంచా దుకాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి

### -పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం జిల్లాలో బాణసంచా దుకాణాలు పెట్టుకోదలచిన వ్యాపారులు అక్టోబర్ 25 తేది సాయంత్రం లోపు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొందాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, నగర పాలక శాఖ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు, టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ధరఖాస్తుతో పాటు ఏఈ-5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్ , చలానా రిసిప్ట్,. ఆధార్ కార్డ్ , ఫోటో జతపరచి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

# సూచికల ఏర్పాటులో జాతీయ రహదారుల అధికారుల వైఫల్యం

**గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు :** గుడివాడ వెళ్లవలసిన వారికి గందరగోళం సృష్టిస్తున్న జాతీయ రహదారి అధికారులు. చెన్నై కలకత్తా జాతీయ రహదారికీ హనుమాన్ జంక్షన్ లో బైపాస్ ఏర్పాటు చేశారు. ఏలూరు వైపు నుండి గుడివాడ ప్రయాణం చేసే వారికి బొమ్ములూరు దగ్గరలో గుడివాడ వైపు సూచిస్తూ ఒక పెద్దసైన్ బోర్డు, అదేవిధంగా డివైడర్ మధ్యలోచిన్న బోర్డు పెట్టారు. ఆ బోర్డులు చూసుకుని హైవే దిగి సర్వీస్ రోడ్డు ద్వారా పిరికిడు వద్దనున్న గుడివాడ రహదారికి చేరుకుంటున్నారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. విజయవాడ వైపు నుంచి గుడివాడ వెళ్లవలసిన వారికి గుడివాడ ను సూచించే బోర్డు లేకపోవడం తో గందరగోళపడుతున్నారు. కొంతమంది హనుమాన్ జంక్షన్, వేలేరు అనే సైన్ బోర్డు దగ్గర దిగడం ద్వారా నాలుగు కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్ లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. అది గనక కనపడకపోతే బొమ్ములూరు వరకు వెళ్లాక అక్కడ దిగి సర్వీస్ రోడ్డు ద్వారా వెనక్కు వస్తున్నారు. ఇందువల్ల అదనపు కిలోమీటర్ల ప్రయాణం సమయ భావం ఎదుర్కొంటున్నారు.

# విద్యతో మాత్రమే అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు
- అన్ని వర్గాల వారు ఒకే చోట చదువుకునే దిశగా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణం
-ఖమ్మం నగరానికి నాలుగు దిక్కులా ఖబరస్థాన్ ల ఏర్పాటుకు చర్యలు
-షాదీఖానా అభివృద్ధికి మరో 50 లక్షలు మంజూరు
-మస్జిద్ ల రిపేర్ కొరకు లక్ష చొప్పున 63 మస్జిద్ లకు చెక్కులను అందజేసిన మంత్రి తుమ్మల





ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు : విద్యతో మాత్రమే అభివృద్ధి సాధ్యమవు తుందని, మన పిల్లలకు తప్పనిసరిగా మంచి విద్య అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఖమ్మం ఉర్దూ షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఖమ్మం నియోజక వర్గంలో ఉన్న 63 మస్జిద్ లకు, మస్జిద్ ఒక్కటికి లక్ష చొప్పున రిపేర్ కొరకు మంజూరు చేసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ వరదలు, పార్లమెంట్ ఎన్నికల కారణంగా మసీదుల నిర్వహణ నిధులు ఆలస్యం జరిగిందని, పెద్దలు చెప్పినట్లుగా ఇక నుంచి ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ ముందుగానే మసీదుల నిర్వహణ నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సమయంలో ఇప్పుడున్న షాదీఖానా స్థలంలో ఫైర్ స్టేషన్ ఉండేదని, ముస్లీం సోదరులు షాదీఖానా అడిగితే ఇక్కడ ఏర్పాటు చేశామని అన్నారు. షాదీఖానా నిర్వహణ బాగా లేదని, షాదీఖానా నిర్వహణ కోసం మరో 50 లక్షలు మంజూరు చేస్తామని, కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి పకడ్బందీగా షాదీ ఖానాను తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఖమ్మం నగరం అన్ని వైపులా ఖబరస్థాన్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఖమ్మం నగరంలో ఉన్న హిందువులు, ముస్లిం, క్రిస్టియన్ మొదలగు అన్ని వర్గాల వారు అన్నదమ్ముళ్ల కలిసి ఉండే చరిత్ర ఉందని, దానిని కొనసాగించాలని మంత్రి తెలిపారు. మన రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారు చదువుకునే ఏర్పాట్లు చేయాలని, విద్యతోనే మన కుటుంబాలు బాగుపడతాయని, మనకు ఎన్ని కష్టాలు ఉన్నా పిల్లల చదువు ఆపవద్దని అన్నారు. ప్రభుత్వం ఇటీవలే ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణాన్ని ప్రారంభించిందని, అన్ని కులాలు, వర్గాల వారు ఒకే చోట చదువు కునే ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 300 కోట్లు ఖర్చు చేసి అన్ని వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే విధంగా కష్టపడే కలెక్టర్ మనకు ఉన్నారని, ముస్లిం కమ్యూనిటీకి ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లాలని, శక్తి మేరకు కలెక్టర్ పూర్తి చేస్తారని, కానీ పక్షంలో ప్రభుత్వం తరపున ఆ పనులు పూర్తయ్యే విధంగా తాను చర్యలు తీసుకుంటానని అన్నారు. మంజూరైన షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని పెద్దలందరూ కూర్చుని సూచించాలని, అందరికీ సౌకర్యం ఉండే విధంగా స్థలం చూపిస్తే అక్కడ షాదిఖానా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. ముస్లిం కమ్యూనిటీ శాశ్వత అభివృద్ధి కోసం మనం పని చేయాలని, ఎటువంటి విభేదాలు మనకు వద్దని, పార్కింగ్ సౌకర్యం బాగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మంత్రి సూచనల మేరకు నెలన్నర క్రితమే ఈ కార్యక్రమం జరగాలని, వరదలు, ఇతర సమస్యల కారణంగా కొంత ఆలస్యం జరిగిందని అన్నారు. 63 మసీదుల నిర్వహణ కోసం లక్ష రూపాయల చొప్పున నిధులను అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో వజూఖాన, కరెంట్, లైట్, ఫ్యాన్ వంటి సదుపాయాలు, నమాజ్ చదివే వారికి అవసరమైన పూర్తి సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారని అన్నారు. దీన్ తో పాటు దునియాపై కూడా దృష్టి పెట్టాలని, మసీదులు, షాది ఖానాలను ఎంత ఉత్సాహంతో కట్టుకుంటున్నామో అంతే ఉత్సాహంతో మన పిల్లల చదువులపై కూడా దృష్టి ఉంచాలని, ఎటువంటి తేడా లేకుండా పిల్లలను బాగా చదివించాలని కలెక్టర్ కోరారు. మంజూరైన షాదీ ఖానా పనులు చేసే విధంగా టెండర్లు పిలిచామని, వాటిని త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ కు నలుదిక్కులా ఖబరస్థాన్ లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారని, ఆ సూచనల ప్రకారం 4 ఖబరస్థాన్ ల ఏర్పాటుకు స్థలం గుర్తించామని, నెల రోజుల వ్యవధిలో స్థలాలను అప్పగించడం జరుగుతుందని అన్నారు. ఈద్ గా కోసం ఒక స్థలం చూశామని, వచ్చే ఈద్ వరకు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మంత్రి స్వయంగా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చారని అన్నారు. ఖమ్మం నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతున్న మంత్రి, మసీదులు సైతం అందంగా ఉండాలనే ఉద్దేశంతో వాటి మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఇంచార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, కార్పొరేటర్ లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మస్జిద్ కమిటీ సభ్యులు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

### రూ .20 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి

# శంకుస్థాపన చేసిన కుటమి నేతలు

- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే రాము నిరంతరం కష్టపడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు





గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం పరిష్కరించడమే లక్ష్యంగా. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిరంతరం కష్టపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు అన్నారు. గుడివాడ రూరల్ మండలం దింటకూరు,నూజెల్ల గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో కూటమి నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.20 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు......కూటమి నేతలతో కలిసి రావి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ సభల్లో రావి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు రాక్షస పాలన చూసిన ప్రజలు.......నేడు కూటమి ప్రభుత్వ ప్రజాపాలన చూస్తున్నారాన్నారు.ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందుబాటులో ఉంటూ..... వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కష్టపడుతున్నారనీ పేర్కొన్నారు. రాబోవు ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే రాము పని చేస్తున్నారనీ...... ముఖ్యంగా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడం.......రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కుప్ప కూలిన వ్యవస్థలను గాడిలో పెడుతూ....... రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం పనిచేస్తున్నారని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ , బిజెపి ఇంచార్జ్ దావులూరి సురేంద్రబాబు, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, జానసేన అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర, ఎండిఓ విష్ణు ప్రసాద్ ,టీడీపి గోర్జి సత్యనారాయణ, కొడాలి రామరాజు,వీరవరపు వంశీ , డి ఈ బి. రవి , ఏఈ వి. సూరిబాబు ,ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ అట్లూరి వెంకటేశ్వ రావు, దింటకుర్రుగ్రామ టిడిపి నాయకులు మెండం వీర్రాజు, పోనుకుమాటి విజయ్ ,మేడేపల్లి వెంకటేశ్వరరావు,ఆకునూరు స్వామి, నుజేళ్ల టిడిపి నాయకులులి గోగులమూడి నాగరాజు, కొదమల జాకబ్ ,రేమల్లి విన్ను ,పొట్లూరి రాధాకృష్ణ,సుభాని,సింగవరపు సుబ్బారావు, మండల పరిధిలోని టిడిపి, జనసేన పార్టీల శ్రేణులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

### పలు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్ల పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.


# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో భోజన సదుపాయం ఏర్పాటు చేసిన శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబర్ 15 : కందుకూరు పట్టణంలో తుఫాను నేపథ్యంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా గడ్డం వారి కష్టాలు 1,2 వార్డ్ లోని యానాది కాలనీ, పుట్ట ప్రాంతాలో ఇళ్లల్లోకి నీరు చేరాయి. ఈ విషయం తెలుసుకున్న శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరావు ఆ ప్రాంతంలోని సుమారు 200 మందికి తన సొంత నిధులతో భోజన సదుపాయం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పుట్ట ఏరియా, యానాది సంఘం ప్రజలు వారు శాసనసభ్యులు నాగేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక
బుధవారం 16-10-2024


# పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్ లో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణి, సిడిపిఓలు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, పిల్లల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లాలో 969 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, అద్దె భవనాలలో కొనసాగుతున్న కేంద్రాలను ప్రభుత్వ స్వంత భవనాలకు మార్చేందుకు కార్యచరణ రూపొందించాలని, ప్రభుత్వ భవనాలలో కొనసాగుతున్న కేంద్రాలలో అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, కేంద్రాలలో పోర్టబుల్ మూత్రశాలలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భం దాల్చిన మహిళలు, బాలింతల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భం దాల్చిన మహిళలు అంగన్వాడీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తమ వివరాలు నమోదు చేసుకొని, సమయానుసారంగా అవసరమైన పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు పిల్లలలో మానసిక, శారీరక ఎదుగుదలపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఎదుగుదల లోపం ఉన్న వారిని గుర్తించి సమయానికి పౌష్టికాహారం, అవసరమైన మందులను అందిస్తూ సాధారణ స్థితికి తీసుకువచ్చేలా కృషి చేయాలని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లయితే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించాలని, అవసరమైతే పిల్లల వైద్య నిపుణుల వద్ద వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు తలసేమియా, సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఆహార సామాగ్రి నిల్వలు, మందులు, హాజరు పట్టిక రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైనది

## – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** భావి తరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి ఎస్ సి.-2024లో నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులకు పోస్టింగ్ కొరకు నిర్వహించిన కౌన్సిలింగ్ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ, మంచి అలవాట్లు, నడవడిక అందించి వారి భవిష్యత్తు తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైదని అన్నారు. డి ఎస్ సి.-2024లో నియమితులైన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, విద్యార్థులతో మమేకమై వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తూ ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 288 పోస్టులు ఖాళీ ఉండగా 248మంది అర్హత సాధించారని, కౌన్సిలింగ్ కార్యక్రమానికి 230 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత గల వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి

## -పిఆర్టీయూ టిఎస్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి





**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ టిఎస్ జిల్లా అధ్యక్షులు మందల తిరుపతి రెడ్డి అన్నారు. మంగళవారం పీఆర్టీయూ టిఎస్ మండల శాఖా ఆధ్వర్యంలో ధర్మసాగర్ బాయ్స్ హై స్కూల్ లో వరంగల్-నల్గొండ -ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు మందల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ...ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న,యంగ్ అండ్ డైనమిక్ లీడర్ మన పీఆర్టీయూ టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిళి శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నందున వారిని గెలిపించుకోవడం చారిత్రక అవసరం అని అన్నారు. ఆ దిశగా అందరూ కృషి చేయాలనీ పీఆర్టీయూ టిఎస్ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహా అధ్యక్షులు రాఘోత్తం రెడ్డి,రమేష్,జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పి.సరస్వతి, మండల శాఖా అధ్యక్షా,కార్యదర్శులు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,జాన్ సింగ్,మహిళా ఉపాధ్యక్షురాలు తులసి,ఖాజీపేట్ అధ్యక్షులు మాల కొండారెడ్డి,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ను కలిసిన రాజారపు సుమన్

## -మాజీ ఎమ్మెల్సీ పల్లాను మర్యాద పూర్వకముగా కలిసిన సుమన్



మాజీ మంత్రి కేటీఆర్ ను కలుసుకున్నా యువనాయకులు రాజరాపు సుమన్.



మాజీ ఎమ్మెల్సీ,జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కలిసిన సుమన్

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్,మాజీ మంత్రి కేటీఆర్ ను ధర్మసాగర్ మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు,మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు సుమన్ మంగళవారం హైదరాబాద్ నంది హిల్స్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని,అందుకు సిద్ధంగా ఉండాలని,యువత కీలకంగా పనిచేసి స్టేషన్ ఘనపూర్ లో మళ్ళీ గులాబీ జెండాను ఎగురవేయాలని కేటీఆర్ సూచించినట్లు సుమన్ తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ,జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని రాజారపు సుమన్ మర్యాద పూర్వకముగా కలిసి,దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజకీయ పార్టీలకు కాటికాపరుల బతుకు సమస్య పట్టదా..

**కర్నూలు, తెలంగాణ ముచ్చట్లు :** రోజువారి ప్రగల్భాలు పలికే రాజకీయ పార్టీలకు తరతరాలుగా సమాజం అందరికీ ఉపయోగపడే వృత్తిని నిర్వహిస్తున్న కాటికాపరుల సమస్య పట్టదా అని కేజీబియస్ రాష్ట్ర నాయకులు యం డి ఆనంద్ బాబు ఎద్దేవా చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని శివ సర్కిల్ ఎస్బిఐ ఎటిఎం పైన ఉన్న కేవీపీఎస్ కార్యాలయంలో స్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరుల సమస్యలపై జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. కాటి కాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా అధ్యక్షులు బేగరి తిక్కప్ప అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సును ఉద్దేశించి ఆ సంఘం రాష్ట్ర నాయకులు యం డి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్ జి కృష్ణ, కెవిపియస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే రంగమ్మ, జిల్లా అధ్యక్షులు యస్ దేవసహాయం, ఎపిడికెయస్ జిల్లా కార్యదర్శి బి కరుణాకర్ మాట్లాడారు.

సదస్సును ఉద్దేశించి వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న వృత్తులన్నీ ఒకవైపు అయితే, దళితులు భుజానెత్తుకొని నిర్వహిస్తున్న వృత్తులు మాత్రం సమాజం అంతటికి ఉపయోగపడే వృత్తులన్నారు. తరతరాలుగా ఈ వృత్తుల ద్వారా సేవలందిస్తున్న దళితులు మాత్రం కడుపునిండా తిండి, వంటిపై కో గుడ్డ, తలుతాచుకోవడానికో గూడు కోసమే జీవిత కాలం ఊడిగంలా ఈ వృత్తులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కరోనా కంటే భయంకరమైన వ్యాధులు ప్రభలే స్మశానాల్లో వృత్తిని నిర్వహించే కాటికాపర్లు నేటికీ కనీసం వృత్తి దారులుగా కూడా గుర్తించబడలేదన్నారు. ఎంత పెద్ద అధికారులైనా పాలకులైన మీరు చస్తే పూడ్చేది లేదా కాల్చేది మేమే నన్నారు. ఓట్ల కోసం మాత్రమే మా ముందుకొచ్చే రాజకీయ పార్టీలన్నీ, కాటికాపరులందరిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, భృతిని కల్పించాలి అనే మా డిమాండ్ పై స్పందించాలన్నారు. లేనిచో నల్ల చొక్కాల సైన్యమై తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. సదస్సును ఉద్దేశించి ఎపిసివియస్ జిల్లా కార్యదర్శి సుమాల ఆంథోని, కెవిపియస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య, జిల్లా నాయకులు హనుమంతు, మండల అధ్యక్షులు యస్ తిమ్మన్న, సహాయ కార్యదర్శి రాజారమేష్ మాట్లాడారు. సదస్సు లో కేజీబియస్ జిల్లా ఉపాధ్యక్షులు మధన గోపాల్, యువరాజు, వీరేష్, సురేష్, సహాయ కార్యదర్శులు ఈశ్వరయ్య, నాగశేషులు, రంగన్న, ఫిలిప్, మద్దిలేటి, జిల్లా కమిటి సభ్యులు నాగన్న, నరసింహులు, తొడ బలం కేశన్న, ఆంజనేయులు, నరసింహ, దాసు, ప్రకాశం, దావీదు, బసవ, దేవరాజు, జయరాజు, నరసన్న, చార్లెస్ తో పాటు మరో వంద మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జయంతి సందర్భంగా



**ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు :** ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ దగ్గర గల కృషి పండ్ల తోటల రైతు సేవా సొసైటీ కార్యాలయంలో భారత దేశం ముద్దుబిడ్డ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారి జయంతి దినోత్సవం ఆత్మకూరు దివంగత సర్పంచ్ ఎంఏకే జిలాని తనయుడు రైతు సంఘం నాయకులు మోమిన్ మునీర్ భాష, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు బైరాపురం మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఘనముగా నిర్వహించారు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారు చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎం. ముర్తుజాబైగ్, టైగర్ బాబు, లింగమూర్తి, ఎస్సీ నాయకుడు సముద్రాల శికామణి, ముసలమడుగు నబి సాహెబ్, ఎన్ఎస్ అసదుల్లా, ముసలముడు రసూల్, బైరాపురం రహం (కాంట్రాక్టర్), మోమిన్ జబ్బార్, మోమిన్ నజముద్దీన్, మారుస ముర్తుజ, అలీ సబ్ అన్వరే, నశం షఫీ ఉల్లా, ఎస్ వరప్రసాదే,కే జి ఎన్ మహ్మద్ హుస్సేన్, మోమిన్ ఇస్సు, ఉప్పు సత్తార్, తలముడిపి ముహమ్మద్ గౌస్, కవ్వా ఖాదర్, ముసలమడుగు మాగ్బుల్, పోల్పరి షరీఫ్, ఆవుల అల్లాబాకష్, మంగలి సుబ్బరాయుడు, శివ,బైరపురం అక్బరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# పల్లె పండుగకు ఎద్దుల బండితో బి.వి.జయ నాగేశ్వర్రెడ్డి కి ఆహ్వానం పలికిన మాజీ సర్పంచ్ కాసిం వలి

-మాచపురం గ్రామానికి వివిధ పనులకు 40 లక్షలు మంజూరు

- 10 లక్షల సిసి రోడ్లు డ్రైనేజీ లకు 2,30,000 మినీ గోకులంకు పల్లె పండగ వారోత్సవాలు

- జల్జీవన్ మిషన్ కింద 480 కుళాయి ఇంటింటికి మంజూరు చేసిన ఘనత బి వి జె

- ఈ గ్రామంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పిడికెడు మట్టి వేసిన పాపాన పోలేదు





నందవరం మండలం,తెలంగాణ ముచ్చట్లు : నందవరం మండల పరిధిలో మాచపురం గ్రామ పంచాయతీలో ముందుగా ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు బీవీ జయ నాగేశ్వర్రెడ్డి కి ఎద్దుల బండితో స్వాగతం పలికేనా మాచాపురం గ్రామస్తులు 10 లక్షల సిసి రోడ్లు డ్రైనేజీ లకు,మినీ గోకులం షెడ్ కు భూమి పూజ చేశారు.అదేవిధంగా ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుని వీధి వీధి లకు సీసీ రోడ్లు డ్రైనేజీలు మంజూరు చేశామని ఆ గ్రామ ప్రజలకు తెలిపారు. గత ప్రభుత్వంలో మీ సమస్యల్ని అడిగిన నాథుడు లేదని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారు ప్రవేశపెట్టిన పల్లె పండుగ వారోత్సవాలు జరుపుకొనుటకు ఈనెల 20 తేది వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నడుచుకుంటూ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, మైనార్టీ కాలనీ, చావడివీధి సి సి రోడ్డు, వీధి వీధికి పది లక్షలు మంజూరు చేశారు. జగన్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు అభివృద్ధికి ఈ గ్రామాము నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అయినా కాలేదు 480 వందల కుళాయి లు ఫ్రీఇస్తామని తెలిపారు. అదేవిధంగా పాత సచివాలయం ఆఫీస్ నందు పశువుల ఆసుపత్రికి సంబంధించిన స్టాల్స్ ను కూడా పరిశీలించారు, రైతులకు పశువులకు ఉపయోగపడే మందులు కూడా ఫ్రీగానే అందజేశారు.మినీ గోకులం 2,30లక్షలు ఎం ఎన్ ఆర్ ఈ జి ఎస్ క్రింద, మొండి ముళ్ల లక్ష్మీకాంత,అనే వేక్తి మంజూరు చేశారు.అదేవిధంగా భూమి పూజ చేశారు.సచివాలయం, ప్రారంభించారు.అదేవిదంగా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అభివృద్ధి పండుగ వారోత్సవాలు ప్రారంభించిన ఘనత జయ నాగేశ్వర్ రెడ్డి కె దక్కింది అన్నారు. గత ప్రభుత్వంలో బిల్లు కానీ ఇండ్లకు కూడా రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొత్తగా ఇల్లు కట్టించుకునే వాళ్లకు మార్చి 31వ తేదీ లోపు ఆన్లైన్ చేసుకోవాలని ఆయన సభాముఖంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, ఏపీవో శ్రీనివాసులు, ఏపిఎం రాఘవేంద్ర, పంచాయతీరాజ్ శాఖ అధికారులు హౌసింగ్ అధికారులు యు ఓ ఆర్ డి,ఎంఈఓ, అంగన్వాడి సూపర్వైజర్, వెటర్నరీ అధికారులు టిడిపి నాయకులు పులిచింత బండే గురుస్వామి,మండల కన్వీనర్ చిన్నరాముడు, మండల క్లస్టర్ ఇంచార్జి కాసింవాలి, జగన్నాథ రెడ్డి, బడేసావ్ వలి, గోపాలు నాగరాజు,ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు, ఆ గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 5,6 తేదీల్లో ఆదోనిలో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్




ఆస్పరి,తెలంగాణ ముచ్చట్లు : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కర్నూలు జిల్లా 30 వ మహాసభలు నవంబర్ 5,6 తేదీల్లో ఆదోని పట్టణంలో ఘనంగా జరిగే ర్యాలీ,బహిరంగ సభలకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించాయని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానం పేరుతో విద్యా కాషాయకరణ, ప్రైవేటీకరణ,కార్పొరేటీకరణ కు తెరలేపిందని ఆరోపించారు. పాఠ్య పుస్తకాల్లో శాస్త్రీయ భావాజాలాన్ని తొలగించి, అశాస్త్రీయ భావజాలాన్ని చేర్చి, విద్యార్థుల మెదళ్లను మరింత అజ్ఞానంలోకి నెడుస్తుందని,ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల యొక్క జీవిత చరిత్రలను తొలగించి, దేశద్రోహుల చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చడం జరుగుతుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని ఆఘమేఘాల మీద అమలు చేసి, పాఠశాలల విలీన ప్రక్రియను చేపట్టిందని అన్నారు. అంతేకాకుండా గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద విద్యార్థుల కడుపులు నింపేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడితే, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎత్తేసి, పేద విద్యార్థుల కడుపులు మాడ్చారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన,బోధనేతర పోస్టులు అనేకంగా ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జూనియర్ కళాశాలలో మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం కూడా పట్టించుకోకుండా, వాటిని గాలికి వదిలేశాయని అన్నారు. గతంలో పాదయాత్ర సమయంలో నారా లోకేష్ విద్యారంగా సమస్యలన్నిటిని కూడా రెడ్ బుక్ లో చేర్చుకున్నానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కావున కర్నూలు జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ జిల్లా మహాసభల్లో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు వేదికగా మారుతున్నాయని, ఈ మహాసభలను విద్యార్థులు, మేధావులు సహకరించి,పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**కళాశాల నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం ఏఐఎస్ఎఫ్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షుడిగా రంగస్వామి, ఉపాధ్యక్షులుగా జగదీష్,శశికాంత్, ప్రధాన కార్యదర్శిగా రెహమాన్, సహాయ కార్యదర్శులుగా వినోద్,రవితేజ, కోశాధికారిగా వీరేష్ లతోపాటు, గర్ల్స్ కన్వీనర్ గా లావణ్య, కో కన్వీనర్లుగా మమత అశ్వినిలను ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాజు,అనిల్, నాగముని, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెడ్మాస్టర్ నరేష్ పై చర్యలు తీసుకోవాలి

**విద్యార్థులను కూలం పేరుతో దూషించిన పూలచింత హెచ్ఎం నరేష్ ను సస్పెండ్ చేయాలి**





నందవరం మండలం,తెలంగాణ ముచ్చట్లు : నందవరం మండలం పులచింత గ్రామంలో ఎంపీపీ పాఠశాల గత 45 రోజుల క్రితం అంటరానితనాన్ని హెచ్ఎం నరేష్ టీచర్ పవన్ కనపరిచారని ఎంఈఓలు గారు ఇద్దరి పైన విచారణ జరపగా ఒకరిని మాత్రమే సస్పెండ్ చేసి సస్పెన్షన్ లో ఉన్న హెచ్ఎం నరేష్ పై ఈరోజు కర్నూల్ డీఈఓ ఆదేశాల మేరకు ఆదోని డిప్యూటీ డీఈవో విచారణ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఆర్ యు ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రావణమాసం పేరుతో గుడ్లను ఉడికించకుండా 30 రోజులు పాటు పచ్చి గుడ్లు విద్యార్థులకు అందించి అదేవిధంగా కులం పేరుతో దూషించినటువంటి హెచ్ఎం ను కూడా సస్పెండ్ చేయాలని అదేవిధంగా విద్యార్థులను అసభ్య పదజాలాలతో కింద నుండి పై దాకా బలిసిందా మీకేమైనా అనే మాటలతో విద్యార్థులను బాధించడం జరిగిందని బాల్యం వయసులోనే కులాన్ని రుద్దినటువంటి హెచ్ఎం పై చర్యలు తీసుకోవాలని విద్యాబుద్ధులు నేర్పించాల్సినటువంటి టీచర్లే కులాల రొచ్చులో పొర్లాడమంటే ఇది విద్యాశాఖకే సిగ్గుచేటు అని తక్షణమే హెచ్ఎం నరేష్ విధుల నుండి తొలగించి ఇలాంటివి ఎక్కడ పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు చూడాలని వారు కోరారు లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్రిక్తం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాగభూషణం ఇశ్రాయేలు వసంత్ పెద్దయ్య తదితరలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాలను పరిశీలించిన విద్యుత్ శాఖ ఇఇ నాగేశ్వరరావు






సింగరాయకొండ ప్రకాశం జిల్లా,తెలంగాణ ముచ్చట్లు : తూఫాన్ ప్రభావపుతీర ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లెల నాగేశ్వరరావు పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా సింగరాయ కొండ లోని పాకల, ఊళ్ళపాలెం గ్రామాల్లో పర్యటించారు. పాకల లోని హైస్కూల్, ఊళ్ళపాలెం స్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఏపరిస్థితిలోనైనా సరే సిబ్బంది అందుబాటులో ఉండి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. గ్రామ పంచాయతీల వారు ఏర్పాటు చేసిన జెనరేటర్ లను పరిశీలించారు.ఈ పర్యటనలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్, అసిస్టెంట్ ఇంజనీర్ సాంబశివరావు, లైన్ ఇన్ స్పెక్టర్ పెయ్యల సురేష్, పాకల లైన్మెన్ ప్రసాద్, ఊళ్ళపాలెం ఏఎల్ఎం గోపి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపండి

ఏలూరు,తెలంగాణ ముచ్చట్లు : అర్జీదారులు తెలియజేసిన సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి నాణ్యమైన పరిష్కారాన్ని వేగవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్విసంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ ఓ డి.పుష్పమణి ,డిఆర్డీఏ పీడి ఆర్ . విజయరాజు,ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం.ముక్కంటి,కె.భాస్కర్లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.వివిధసమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ ఎస్ కు ప్రజల నుంచి 81 వినతులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పీజీఆర్ఎస్లో ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీలకు పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..**


ద్వారకా తిరుమల మండలం సంద్రుగుంటకు చెందిన చిగురుపాటి మోహన్ రావు అర్జీనిస్తూ తనకు తెలియకుండా తన పిల్లలు ఇల్లు తాకట్టు పెట్టి మోసం చేశారని ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్, ద్వారకాతిరుమల సబ్ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. శనివారం పేటకు చెందిన బొడ్డు రామానుజయ వినతిపత్రం ఇస్తూ 26వ డివిజన్ శనివారపేట కుమ్మరి గొయ్యి రోడ్డుపై అక్రమంగా షాపులు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. తన కుటుంబ పోషణార్థం తన భర్త నుంచి భరణం ఇప్పించాలని, రక్షణ కల్పించాలని కోరారు.దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పిడిని ఆదేశించారు.

# భారతరత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94 వ జయంతి వేడుకలు




కందుకూరు, తెలంగాణ ముచ్చట్లు : భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94 వ జయంతి వేడుకలను కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు పాల్గొని ఏపీజే అబ్దుల్ కలాం గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# సినిమా న్యూస్




# మృణాల్.. తప్పుకోవడమే బెటర్



తెలుగు, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ గా తనదైన బ్రాండ్ తో దూసుకుపోతున్న అందాల భామ మృణాల్ ఠాకూర్. 'సీతారామం' సినిమాతో తెలుగునాట మృణాల్ ఠాకూర్ కి విశేషమైన గుర్తింపు లభించింది. దాని తర్వాత 'హాయ్ నాన్న' తో మరో హిట్ అందుకుంది. చివరిగా ఈ ఏడాది విజయ్ దేవరకొండకి జోడీగా 'ది ఫ్యామిలీ స్టార్' మూవీతో మృణాల్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. ఇదిలా ఉంటే మృణాల్ ఠాకూర్ హిందీలో 'పూజా మేరీ జాన్' అనే సినిమా చేసింది. హ్యూమా ఖురేషి ఈ సినిమాలో మరో లీడ్ రోల్ లో చేసింది. నవంబర్ లో ఈ సినిమాని రిలీజ్ చేయడానికి ముందుగా ప్లాన్ చేశారు. అయితే ఇప్పుడు 2025కి మూవీని వాయిదా వేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి కారణం విక్కీ కౌశల్, రష్మిక జోడీగా నటించిన 'చావా' మూవీ అని తెలుస్తోంది. ఈ సినిమా డిసెంబర్ 6న థియేటర్స్ లోకి రాబోతోంది.భారీ బడ్జెట్ తో హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ మూవీగా ఈ చిత్రం రాబోతోంది. మడ్ డోక్ ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించింది. 'పూజా మేరీ జాన్' సినిమా కూడా అదే బ్యానర్ లో తెరకెక్కింది. ఈ రెండు సినిమాలు బ్యాక్ టూ బ్యాక్ రిలీజ్ చేయాలని ముందు అనుకున్నారు. అయితే 'పూజా మేరీ జాన్ మూవీ' మీద మేకర్స్ ఫుల్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. అలాగే 'చావా' మూవీ పైన భారీ అంచనాలు ఉన్నాయి. ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్ గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. అలాగే పుష్ప 2 కూడా అదే టైమ్ లో వస్తోంది. అసలే హిందీలో ఈ సినిమాకు మంచి బజ్ ఉంది. థియేటర్స్ కూడా గట్టిగానే రావచ్చు. దీంతో 'పూజా మేరీ జాన్' మూవీతో 'చావా' కి ఇబ్బంది అవుతుందని నిర్మాత భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు సినిమాలకి ఇబ్బంది కాకుండా 2025కి మృణాల్ ఠాకూర్ చిత్రాన్ని వాయిదా వేశారంట. ఎలాంటి పోటీ లేకుండా సింగిల్ గా ఆ చిత్రాన్ని రిలీజ్ చేయాలని అనుకుంటున్నారంట. 'చావా' మూవీలో విక్కీ కౌశల్ కి జోడీగా రష్మిక మందన నటిస్తోంది. ఇదిలా ఉంటే దీపావళికి బాలీవుడ్ నుంచి 'సింగం అగైన్' మూవీతో పాటు 'భూల్ భులయ్యా 3' రిలీజ్ అవుతున్నాయి. వీటి తర్వాత డిసెంబర్ 6న 'చావా' థియేటర్స్ లోకి వస్తోంది. క్రిస్మస్ కానుకగా వరుణ్ ధావన్ 'బేబీ జాన్' చిత్రంలో రిలీజ్ కాబోతోంది. ఇలా కాస్త హైప్ ఉన్న సినిమాలు అన్ని కూడా రెండు నెలల గ్యాప్ లో బ్యాక్ టూ బ్యాక్ బాలీవుడ్ లో విడుదల కాబోతుండటం విశేషం.

# 'సాహో' శ్రద్ధ పెళ్లి కబురు



'సాహో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది శ్రద్ధా కపూర్. తనవైన అందచందాలు నటనతో ఆకట్టుకుంది. అంతకుముందు ఆషిఖీ 2లో అద్భుత నటనతో భాషా భేధం లేకుండా అభిమానులను సంపాదించుకున్న ఈ బ్యూటీ 'సాహో' లాంటి పాన్ ఇండియా సినిమాలో నటించడం ద్వారా తన స్థాయిని ఫాలోవర్స్ ని విస్తరించింది. ఇటీవల ఈ బ్యూటీ సినిమాలతో కంటే రిలేషన్ షిప్స్ పరంగానే ఎక్కువగా హెడ్ లైన్స్ లోకొస్తోంది. శ్రద్ధా కపూర్ ఇంతకుముందు ఆషిఖీ 2 సహనటుడు ఆదిత్యారాయ్ కపూర్ తో ప్రేమలో ఉందని ప్రచారమైంది. ఆ జంట బ్రేకప్ అయిన తర్వాత దర్శకనిర్మాత ఫర్హాన్ అక్తర్ తోను ముడిపెట్టి వార్తలు వచ్చాయి. కానీ ఈ బంధం కూడా ఎక్కువ కాలం నిలవలేదని అదే బాలీవుడ్ మీడియా కథనాలు వండి వార్చింది. అటుపైనా పలువురితో శ్రద్ధా కపూర్ ప్రేమాయణం సాగించిందని కూడా ప్రచారం జరిగింది. అందులో ప్రభాస్ పేరు కూడా వినిపించింది. సాహో సమయంలో ఆ ఇద్దరూ ప్రేమలో పడ్డారని ప్రచారమైనా కానీ, అది నిజం కాదని ఆ తర్వాత వారు ఖండించారు. ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ స్త్రీ 2లో నటించిన శ్రద్ధా కొన్ని నెలలుగా రాహుల్ మోడీ అనే బిజినెస్ మేన్ తో డేటింగ్ చేస్తున్నట్లు పుకార్లు వచ్చాయి. అయినా ఈ పుకార్లపై శ్రద్ధా మాట్లాడలేదు. అయితే తాజా ఇంటర్వ్యూలో శ్రద్ధా తాను రిలేషన్‌లో ఉన్నానని అంగీకరించింది. కాస్మోపాలిటన్‌కి ఇచ్చిన కొత్త ఇంటర్వ్యూలో "తన భాగస్వామితో గడపడం తనకు చాలా ఇష్టం" అని శ్రద్ధా తెలిపింది. "నా భాగస్వామితో సినిమా చూడటం.. డిన్నర్‌కి వెళ్లడం లేదా ప్రయాణం చేయడం వంటి పనులు నాకు చాలా ఇష్టం. నేను సాధారణంగా కలిసి పనులు చేయడానికి లేదా ఒంటరిగా సమయాన్ని గడపడానికి ఇష్టపడే వ్యక్తిని. ఉదాహరణకు నా స్కూల్ ఫ్రెండ్స్ ని కలవకపోయినా అది నా మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. నిన్న మేము కుటుంబసమేతంగా భోజనం చేసాం. ఇది చాలా ఎగ్జయిట్ చేసింది. నాతో సంబంధంలో ఉన్నవారితో ఇలాగే ఉంటాను" అని తెలిపింది. ఇంటర్వ్యూలో వివాహ ప్రణాళికల గురించి శ్రద్ధా ప్రశ్న ఎదుర్కొంది. పెళ్లిపై నమ్మకం ఉందా లేదా? అనేది కాదు కానీ, సరైన వ్యక్తిగా ఉండటం .. సరైన వ్యక్తితో ఉండటం గురించి ప్రశ్న ఇది అని భావిస్తాను.ఎవరైనా వివాహం చేసుకోవాలని భావిస్తే అది చాలా బాగుంటుంది.. కానీ వారు పెళ్లి చేసుకోకూడదని భావించినా అది కూడా చాలా బాగుంటుంది! అని శ్రద్ధా డ్యూయల్ టోన్ వినిపించింది. పెళ్లి చేసుకున్నా చేసుకోకపోయినా బాగానే ఉంది కదా! అనేది తన ఉద్దేశం. శ్రద్ధా కపూర్ 'స్త్రీ 2' భారతదేశంలో అత్యధిక వసూళ్లు చేసిన హిందీ చిత్రంగా నిలిచింది. షారుఖ్ ఖాన్ జవాన్ జీవితకాల కలెక్షన్లను అధిగమించింది.

# చుక్కల మధ్యలో అందమైన చందమామ!



చుక్కల మధ్యలో చందమామ అందాన్ని వర్ణించడం ఎవరికి సాధ్యం. మిరుమిట్లు గొలిపే నక్షత్రాల మధ్యలో నిండైన చందమామ ఎంతో అందంగా..అద్భుతంగా కనిపిస్తుంది. ఇది ఆకాశంలో కనిపించే చందమామ గురించి. మరి భూలోకంలో అంతటి అందమైన చందమామ ఎవరు? అంటూ ఈ 22 ఏళ్ల బ్యూటీ గురించి మాట్లాడుకోవాలేమో! అవును బాలీవుడ్ యువ నటి సయిమంజ్రేకర్ ఇక్కడ అంతే అందంగా హైలైట్ అవుతుంది. లెహంగా దుస్తుల్లో అమ్మడి బ్యూటీకి ఫిదా అవ్వాల్సిందే. చున్నీ పై ఉన్న చుక్కల డిజైన్ తోనే తానో చుక్కల్లో చందమామలా మెరిసింది. ఓ క్లోజప్ షాట్ లో అచ్చంగా అలాగే హైలైట్ అయింది. చున్నీ వెనుక దాగిన తన అందాన్ని ఇలా హైలైట్ చేసింది. బ్యూటీ తనలో క్లీవేజ్ అందాలతో మరోసారి మంత్రముగ్దుల్ని చేసింది. చారడేసి కళ్ళు ..నుదిటిన వైట్ స్టికర్..పెదాలపై ఎరుపందం..చెవులకు ధరించిన బుట్టలు ప్రతీది అమ్మడి అందాన్ని అంతకంతకు రెట్టింపు చేసాయి. వివిధ భంగిమల్లో అమ్మడు ఇచ్చిన ఫోజులు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. అమ్మడికి యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. ఆ ఫాలోయింగ్ ని ఇలా ఎన్ క్యాష్ చేసుకుంటుంది. ఇక ఈబ్యూటీ బ్యాక్ గ్రౌండ్ గురించి తెలిసిందే. బాలీవుడ్ నటుడు మహేష్ మంజ్రేకర్ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం తండ్రీ-కుమార్తెలిద్దరు ప్రొఫెషనల్ గా దూసుకుపోతున్నారు. తెలుగులో గని సినిమాతో లాంచ్ అయింది. అటుపై 'మేజర్' సక్సెస్ తో బాగా పాపులర్ అయింది. బోయపాటి యాక్షన్ ప్యాక్డ్ చిత్రం స్కందలోనూ నటించింది. కానీ మేజర్ తప్ప మిగిలిన రెండు చిత్రాలు నిరాశనే మిగిల్చాయి.

# ముత్యంలా మెరిసిన మాజీ మిస్ వరల్డ్!



మాజీ మిస్ వరల్డ్..మిస్ ఇండియా మానుషీ చిల్లర్ ఇన్ స్టా సంచలనాల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఫ్యాషన్ ఎంపికల్లో తానో బ్రాండ్ బ్యూటీ. ఎప్పటికప్పుడు తనదైన మార్క్ అప్పీరియన్స్ తో అలరించడం మానుషీ ప్రత్యేకత. మోడలింగ్ లో ఆరితేరిన బ్యూటీ కావడంతో నలుగురిలో మరింత స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. తాజాగా అమ్మడు లాక్మే ఫ్యాషన్ వీక్ లో మరోసారి తనలో బ్యూటీతో మతిపోగొట్టింది. అమ్మడు షోని లైవ్ లో వీక్షిస్తున్న వారంతా?అలా కళ్లర్పకుండా వీక్షించి ఉంటారు. అంతటి బ్యూటీతో మానుషీ అలరిస్తుంది. డార్క్ గ్రీన్ అండ్ పింక్ కాబినేషన్ డిజైన్ లో అమ్మడు మెరుపులా మెరిసింది. పాల నురుగల శరీర సౌందర్యంపై అందమైన డిజైనర్ లో మరింత అందంగా హైలైట్ అయింది. చేతి మణికట్టుకు పింక్ కాంబినేషన్ ..కాలికి ధరించి హై హీల్స్ అదే రంగులో హైలైట్ చేసింది. పెదాలపై అందమైన నవ్వు షేస్ కి మరింత బ్యూటీని జోడించింది. ర్యాంప్ పై వాక్ చేస్తూ చివరి క్షణాన.. రెండు చేతులు హిప్ పై పెట్టుకుని వయ్యారంగా కెమెరాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.నెటి జనులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. బ్యూటీఫుల్ స్మైల్ అండ్ క్యూట్ ఏంజిల్ అంటూ పొగిడేస్తున్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in